

ఇందిరా క్యాంటీన్లకు ఆర్థిక కష్టాలు

రూ.65 కోట్ల బకాయిలు

సరుకులు సరఫరా చేయలేమని చేతులెత్తేసిన చెఫ్‌టెక్

11 క్యాంటీన్ల మూసివేత

బెంగళూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మూడున్నరేళ్ల బీజేపీ పాలనలో ఇందిరా క్యాంటీన్ల పట్ల నిర్లక్ష్యం చేశారని మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిందని, మరిన్ని రుచులను పరిచయం చేయడమే కాకుండా మాంసాహారం కూడా అందిస్తామంటూ ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఇచ్చిన హామీ దారి తప్పింది. బెంగళూరు నగర పరిధిలో కాంట్రాక్టర్లకు బిల్లులు సకాలంలో చెల్లించకుండా నిర్లక్ష్యం చేసినందుకు క్యాంటీన్లు కొనసాగించలేమని చెఫ్‌టెక్ సంస్థ ప్రకటించింది. దీంతో నగరంలోని కీలక ప్రదేశాలలో ఉన్న 11 క్యాంటీన్లు మూతపడ్డాయి. నగర పరిధిలో ఇందిరా క్యాంటీన్లకు ఆహార పదార్థాలు సమకూరుస్తున్న చెఫ్‌టెక్ సంస్థ ఇకపై సేవలు కొనసాగించలేమని ప్రకటించింది. బుధవారం రాత్రి భోజనం తర్వాత సేవలు నిలిపివేస్తున్నట్లు వెల్లడించింది. దీంతో నగర వ్యాప్తంగా 11 క్యాంటీన్లు మూతపడ్డాయి. చెఫ్‌టెక్ సంస్థ ఏడాదికి గాను కాంట్రాక్టు పొందింది. క్యాంటీన్ కొనసాగించినందుకు పెండింగ్‌లో ఉన్న రూ.65 కోట్ల బిల్లుల కోసం సుదీర్ఘకాలంగా విడుదల చేయకుండా వాయిదా వేస్తున్నారని తెలిపింది. కోట్లాది రూపాయలు పెండింగ్ బిల్లుల మంజూరు విషయంలో అధికారులు జాప్యం చేస్తున్నారని పేర్కొంది. పద్మనాభనగర్, బసవనగుడి, భైరసంద్ర, వీవీపురం, సిద్దాపుర, హొంబేగౌడనగర్, జయనగర్, విద్యాపీఠ, ఈజీపుర, ఆడుగుడి వార్డుల్లో ఇందిరా క్యాంటీన్లలో సేవలు నిలిచిపోయాయి. ఏడేళ్ల కిందట సిద్దరామయ్య ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నగరంలో నివసించే పేదలు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారి ఆకలి తీర్చడానికి ఐదు రూపాయలకే టిఫిన్, పది రూపాయలకే మధ్యాహ్నం, రాత్రి భోజనం సమకూరుస్తూ ఇందిరా క్యాంటీన్లకు శ్రీకారం చుట్టారు. నగర పరిధిలో వార్డుకు ఒకటి చొప్పున ఉండేలా శాశ్వతంగా భవనాలు నిర్మించారు. వీటికి అనుకూలంగా నాలుగైదు క్యాంటీన్లకు ఒక కిచెన్‌ను నిర్మించారు. వార్డుల్లో స్థలం లేని ప్రాంతాల్లో మొబైల్ క్యాంటీన్లు ఏర్పాటు చేశారు. 2018 ఎన్నికల్లో సిద్దరామయ్య ప్రభుత్వం ఓడిపోయింది. జేడీఎస్‌తో కలిసి ఏడాదిన్నర పాటు ప్రభుత్వం సాగించింది. దీంతో ఇందిరా క్యాంటీన్లకు ఢోకాలేదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. తర్వాత యడియూరప్ప, బసవరాజ్‌బొమ్మై నేతృత్వంలో బీజేపీ ప్రభుత్వాలు ఏర్పడినా ఇందిరా క్యాంటీన్ల పేరు మార్చడం కానీ మూసివేయడం కానీ చేయలేదు. 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇందిరా క్యాంటీన్ల సంఖ్య పెంచడంతో పాటు రుచులు మారుస్తామని ప్రచారం చేశారు. ఇందులో భాగంగానే మార్చి నెలలో దేవనహళ్లిలోని కెంపేగౌడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులోను ఇందిరా క్యాంటీన్‌ను ప్రారంభించారు. వేలాది మంది క్యాబ్ డ్రైవర్లు, ఇతరత్రా కార్మికులు, ఉద్యోగులకు అనుకూలంగా ఉంటుందని ఏర్పాటు చేశారు. కానీ, ఇక్కడా అందరికీ టిఫిన్, భోజనం లభించదనే విమర్శలు ఉన్నాయి. ఇలా సాగుతుండగానే నగరంలో ఏడేళ్లుగా కొనసాగిన 11 ఇందిరా క్యాంటీన్లు మూతపడటం సర్వత్రా విమర్శలకు దారితీస్తోంది.

మాట్లాడుతున్న సిద్దరామయ్య



బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సబ్‌ప్లాన్ ఎందుకు లేదు..?

- బీసీ, ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి కట్టుబడ్డాం
- శాసనసభలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య
- వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ అవినీతిపై అధికార, ప్రతిపక్షాల వాగ్వాదం

బెంగళూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): బీజేపీ పాలిత రాష్ట్రాలతో పాటు దేశ వ్యాప్తంగా సబ్‌ప్లాన్ ఎందుకు అమలు చేయడం లేదని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రశ్నించారు. వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ అక్రమాలపై 69వ నిబంధన కింద ప్రతిపక్షాలు లేవనెత్తిన అంశాలకు సీఎం సుదీర్ఘ వివరణ ఇచ్చారు. గురువారం విధానసభలో అధికార ప్రతిపక్షాల మధ్య వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ అవినీతిపై గంటల తరబడి వాగ్వాదం జరిగింది. ప్రతిపక్షనేత అశోక్‌తో పాటు సీనియర్ ఎమ్మెల్యే అరవింద్ బెల్లద్ సహా పలువురు సందేహాలను లేవనెత్తారు. కార్పొరేషన్‌లో అవినీతి జరిగిన సమాచారం తెలిసిన వెంటనే విచారణ కోరామన్నారు. సిట్ విచారణ చేస్తోందని, బ్యాంకు అధికారుల ఫిర్యాదు మేరకు ఈడీ, సీబీఐ సంస్థలు రంగంలోకి దిగాయన్నారు. ప్రతిపక్ష నేత అశోక్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర సీఎంను రాజీనామా చేయాలని కోరుతున్నారని అన్నారు. అరగ జ్ఞానేంద్ర హోంమంత్రిగా వ్యవహరించారని, సిట్ విచారణను వాపసు తీసుకోవాలని డిమాండ్ చేయడం సమంజసమేనా అన్నారు. ఆత్మహత్యకు పాల్పడిన చంద్రశేఖరన్ తమిళనాడు వాసి కాగా, అతడు బోవి సమాజానికి చెందిన వారన్నారు. కానీ బీజేపీ సభ్యులు దళిత సామాజిక వర్గంగా చెబుతున్నారని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన వారి గురించి మాట్లాడే బీజేపీ పాలిత రాష్ట్రాలతో పాటు దేశ వ్యాప్తంగా ఎందుకు సబ్‌ప్లాన్ అమలు చేయడం లేదన్నారు. దళిత వర్గాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సబ్‌ప్లాన్‌తో పాటు సంక్షేమాలు అమలు చేసిన ఘనత తమదే అన్నారు. చంద్రశేఖరన్ ఆత్మహత్య అనంతరం అతడి భార్య ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేశామన్నారు. కార్పొరేషన్ జనరల్ మేనేజర్ రాజశేఖర్ ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసులు నమోదు చేశారని వెల్లడించారు. ప్రతి విషయానికి రాజీనామా కోరడం కంటే వాస్తవాలపై చర్చకు సిద్ధమని పేర్కొన్నారు. వాల్మీకి కార్పొరేషన్‌లో అవినీతికి పాల్పడినవారు ఎవరైనా చర్యలు తప్పవన్నారు. రెండురోజులుగా సాగిన వాయిదా తీర్మానానికి తెరపడింది.



వాదులాటకు దిగిన సభ్యులు

నిరసనలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర



విధానసౌధ ముట్టడికి బీజేపీ యత్నం

ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్

ముఖ్యనేతలంతా అరెస్ట్

బెంగళూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో అవినీతికి నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి సిద్దరామయ్య రాజీనామా చేయాలనే డిమాండ్‌తో విధానసౌధ ముట్టడికి బీజేపీ ముఖ్యనేతలు సిద్ధం కాగా పోలీసులు అరెస్టు చేశారు. గురువారం ఉదయం ఫ్రీడం పార్కు నుంచి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర ఆధ్వర్యంలో నిరసన ర్యాలీకి సిద్ధమయ్యారు. కోర్‌కమిటీ సభ్యులతో పాటు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా విజయేంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో సిద్దరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కోట్లాది రూపాయలు లూటీ చేస్తోందన్నారు. 14 నెలల కిందట అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం అన్నింటా దోచుకునే ప్రయత్నం చేస్తోందన్నారు. అహింద పేరుతో రాజకీయాల్లోకి వచ్చిన సిద్దరామయ్య సమాజంలో అత్యంత వెనుకబడిన వాల్మీకి వర్గాల గ్రాంట్లను దోచారని అన్నారు. లోక్‌సభ ఎన్నికల కోసమే గ్రాంట్లు విడుదల చేయించుకున్నారని, ఇతర రాష్ట్రాలకు నిధులు మళ్లించి నగదుగా మార్చుకున్నారని ఆరోపించారు. సీఎం పదవికి సిద్దరామయ్య రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాల వ్యాప్తంగా నిరంతరంగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే రాజుగౌడ మాట్లాడుతూ కేవలం ఒక మంత్రి మాత్రమే కాదని బాధ్యులైన వారంతా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర మాజీ మంత్రి సదానందగౌడ మాట్లాడుతూ సిద్దరామయ్య సీఎంగా కొనసాగేందుకు ఏవిధంగాను అర్హుడు కాదన్నారు. చలవాది నారాయణస్వామితో పాటు ముఖ్యనేతలంతా పాల్గొన్నారు. పాదయాత్రగా బయలుదేరగా పోలీసులు అడ్డుకున్నారు. బీజేపీ నాయకులందరినీ అరెస్టు చేశారు.



తరలివచ్చిన కార్యకర్తలు

పడగ విప్పుతున్న డ్రగ్స్ మాఫియా

మూడేళ్లలో 20వేలకు పైగా కేసులు

మహానగరం నుంచి మారుమూల పల్లెదాకా విస్తరణ

బెంగళూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఒకప్పుడు కొన్ని ప్రాంతాలకే పరిమితమైన డ్రగ్స్ విక్రయాలు రానురాను దారి తప్పుతున్నాయి. డ్రగ్స్ మాఫియా ప్రతిచోటా యువతను దారి తప్పేలా చేస్తోంది. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంలో డ్రగ్స్ అంశం తీరని సమస్యగా మారుతోంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఫలితాలు ఇస్తున్నాయని అనిపిస్తున్నా అంతకు మించి డ్రగ్ పెడ్లర్లు పెరిగిపోతున్నారు. అదే స్థాయిలోనే డ్రగ్స్ వాడకం కూడా అదుపు తప్పుతోంది. గత మూడేళ్ల వ్యవధిలో డ్రగ్స్ నియంత్రణ చట్టం కింద ఏకంగా 20వేలకు పైగా కేసులు నమోదు చేశారు. అదే స్థాయిలోనే డ్రగ్స్ విక్రేతలు, వాడకందార్లపై కేసులు నమోదు చేశారు. బెంగళూరు, మంగళూరు, మైసూరు నగరాల్లో మాత్రమే ఒకప్పుడు డ్రగ్స్ కేసులు నమోదయ్యేవి. ఇటీవలి కాలంలో శివమొగ్గ, హుబ్బళ్లి, ధారవాడతోపాటు దాదాపు అన్ని జిల్లా కేంద్రాల్లో కేసులు నమోదవుతున్నాయి. యువత, వ్యాపార వర్గాలను టార్గెట్ చేసుకుని డ్రగ్స్ విక్రయాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. మూడేళ్లలో ఎన్‌డీపీఎస్ చట్టం కింద 20,750 కేసులు నమోదు కాగా 20,056 మందిని అరెస్టు చేశారు. హోంశాఖ గణాంకాల ప్రకారం 2021లో 5789 కేసులు నమోదు కాగా 6466 మంది అరెస్టు అయ్యారు.



2022లో 6,406 కేసులు నమోదు కాగా 6,164 మంది అరెస్టు అయ్యారు. 2023లో 6,764 కేసులు నమోదు కాగా 6,267మంది అరెస్టు అయ్యారు. 2024లో జూన్ వరకు 1791 కేసులు నమోదు కాగా 1179 మంది అరెస్టు అయ్యారు. మూడేళ్లలో 20,750 కేసులు నమోదయ్యాయి. వీటిలో అత్యధికంగా బెంగళూరు నగరంలో 12,256, మంగళూరులో 1960, శివమొగ్గలో 810, హుబ్బళ్లి-ధారవాడలో 338 కేసులు నమోదయ్యాయి. డ్రగ్స్ నియంత్రణ కోసం పోలీసుశాఖ తీవ్రమైన ప్రయత్నాలు సాగిస్తోంది. ముందుగా విద్యాసంస్థల్లో అవగాహన కల్పించేందుకు సదస్సులు నిర్వహిస్తున్నారు. అయినా విక్రయాలు కొనసాగుతూనే ఉన్నాయి. దేశమంతటా డ్రగ్స్ మాఫియా యువతను దారి తప్పిస్తోంది. డ్రగ్స్‌కు బానిసలుగా మారినవారు ఎంతటి నేరాలకైనా తెగబడుతున్నారు. ప్రత్యేకించి రాష్ట్రంలో డ్రగ్స్ విక్రయాలు పెరిగేందుకు ఆఫ్రికా దేశాల నుంచి వివిధ రీతులలో వచ్చినవారే కారణమవుతున్నారు. ఒకప్పుడు డ్రగ్స్ అంటే గంజాయి మాత్రమే అందుబాటులో ఉండేది. ఇటీవలి కాలంలో కొకైన్, ఎండీఎంఏ మాత్రల రూపంలోనూ, హషీంతోపాటు పలు రకాల డ్రగ్స్ అందుబాటులోకి వచ్చాయి. కొన్ని డ్రగ్స్ కిలో కోటి రూపాయల దాకా ధర పలుకుతోంది. దేశంలోకి విద్య, విహారం, టూరిస్టుల పేరిట వచ్చే కొందరు డ్రగ్స్ విక్రయాల్లో పట్టుబడేందుకే ఉత్సాహం చూపుతున్నట్టు తెలుస్తోంది. ఒక్కసారి కేసు నమోదైతే పరిష్కారమయ్యే దాకా దేశంలోనే ఉండవచ్చుననే ఎత్తుగడ కూడా వారిలో ఉన్నట్టు తెలుస్తోంది. బెంగళూరులో ప్రత్యేకించి కొన్ని ప్రాంతాల్లో ఆఫ్రికన్ ప్రజల ఆగడాలు తరచూ వివాదాలకు కారణమవుతున్నాయి. మంగళూరు, ఉడుపితోపాటు గోవాకు వెళ్లే ప్రధాన మార్గంలోని కారవార పట్టణంలోనూ డ్రగ్స్ తరచూ పట్టుబడుతున్నాయి. వీసాలు ముగిసినా బెంగళూరులో నివసిస్తున్న వారిని గుర్తించి తుమకూరు సమీపంలోని షెల్టర్‌హోంలో ఉంచారు. వీరిలో ఎక్కువ మంది ఆఫ్రికన్లు ఉన్నారు. డ్రగ్స్ మాఫియాను సంపూర్ణంగా నిర్మూలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణకు సిద్ధమవుతోంది.





దక్షిణకన్నడ జిల్లా మంగళూరు సమీపంలోని కుమ్కి భూములు

కుమ్కి భూములపై సర్కార్ కన్ను

- లీజు ముసుగులో ఖజానా భర్తీకి యత్నం
- వ్యతిరేకిస్తున్న రైతులు

బెంగళూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గ్యారెంటీ పథకాలతో అభివృద్ధి కుంటుపడిందని, గ్రాంట్లు విడుదల చేసే పరిస్థితి లేదని స్వయంగా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులే ప్రకటిస్తున్న వేళ ప్రత్యామ్నాయ ఆర్థిక వనరులు సమకూర్చుకునేందుకు సర్కార్ వ్యూహాలు పన్నుతోంది. ఇందులో భాగంగానే రైతులు సాగు చేస్తున్న కుమ్కి భూములపై కన్నేసింది. దక్షిణకన్నడ జిల్లా ఉమ్మడి జిల్లా పరిధిలో మద్రాసు ప్రాంత రెవెన్యూ పాలనా విధానం 1896 ప్రకారం అక్కడ సాగు చేసే భూమికి వంద మీటర్ల భూమిలో పంటలు పెట్టుకునేందుకు వీలుంది. ఇలా శతాబ్దకాలం నుంచి దక్షిణకన్నడ జిల్లాతోపాటు తీర ప్రాంత జిల్లాలు ఉత్తరకన్నడ, ఉడుపి, చిక్కమగళూరు జిల్లాల్లో ఇటువంటి భూములు కుమ్కి భూములుగా పిలుస్తారు. ఇక్కడి రైతులు గడ్డి, ఆకు కూరలు వంటివి సాగు చేసుకుంటారు. 1964లో రాష్ట్రమంతటా ఒకే చట్టం జారీ అయింది. అవిభాజ్య జిల్లాల రైతులకు కుమ్కి భూముల్లో అన్ని హక్కులు ఉన్నాయని 2013లో హైకోర్టు తీర్పు ఇచ్చింది. కుమ్కి హక్కు అనేది ది షాడో ఆఫ్ ది మ్యాన్‌గా అభివర్ణించారు. ఇందులో ప్రభుత్వ జోక్యం ఉండరాదని స్పష్టం చేశారు. కర్ణాటక భూచట్టం 79/2బి ప్రకారం భూములు ఉండేంతవరకు కుమ్కి హక్కులు కొనసాగుతాయని స్పష్టం చేశారు. సదరు భూములను 1964 కాలం 2 ప్రకారం కాంట్రాక్టు పద్ధతిన మంజూరు చేసేలా ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వం లీజుకు ఇవ్వాలనే నిర్ణయం అశాస్త్రీయమనే వాదనలు ఉన్నాయి. కుమ్కి భూమిని లీజుకు ఇవ్వడమే నేరమవుతుందని కుమ్కి భూమి హక్కుల పోరాట నేత ఎన్‌జీ సత్యనారాయణ తెలిపారు. ప్రభుత్వం ఖజానాకు ఏ విధంగా నిధులు సమకూర్చుకోవాలో ఎత్తుగడలు వేస్తూ కుమ్కి భూముల ప్రస్తావనను తీసుకొచ్చింది. త్వరలోనే ఈ విధానం అమలు చేయాలని భావిస్తున్నారు. అదే జరిగితే దక్షిణకన్నడ జిల్లాతోపాటు పలు ప్రాంతాల రైతులు పోరాటానికి దిగడం ఖాయంగా కనిపిస్తోంది. ప్రభుత్వం కుమ్కి భూములను లీజుకు ఇచ్చేందుకు ధరలు నిర్ణయించింది. ఒక ఎకరానికి వెయ్యి రూపాయలుగాను, 1 నుంచి 5 ఎకరాలైతే రూ.1500 చొప్పున, 5-10 ఎకరాలైతే రూ.2వేలు చొప్పున, 10-15 ఎకరాలైతే ఎకరాకు రూ.2,500 చొప్పున, 15-20 ఎకరాలైతే రూ.3వేలు చొప్పున, 20-25 ఎకరాలైతే రూ.3,500 చొప్పున రైతులు చెల్లించాలనే ప్రతిపాదనలు పెట్టారు. ఉమ్మడి దక్షిణకన్నడ జిల్లాలో రైతులు 1896 నుంచి రైతులు భూములను ప్రభుత్వ భూములను కుమ్కిగా గుర్తించారు. కుమ్కి భూములలో వేలాదిమంది పంటలసాగు చేసుకుంటున్నారు. గతంలో ఎన్నో ప్రభుత్వాలు కుమ్కి భూముల వైపు ఆలోచించలేదు. ప్రస్తుత ప్రభుత్వం పనిగట్టుకుని ప్రయత్నిస్తోందని విమర్శలు ఉన్నాయి. కుమ్కి భూముల పోరాటం హైకోర్టు, సుప్రీంకోర్టులో ఉందని, ఇలా ప్రభుత్వం కాంట్రాక్టు ఇవ్వాలనే ఆలోచన సరికాదన్నారు. ఈ ప్రతిపాదనలు ఉపసంహరించుకోవాలని కుమ్కి పోరాట నేత హెచ్ఎం లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు.



వరదనీటితో కళకళలాడుతున్న తుంగభద్ర జలాశయం


ఆయకట్టు రైతుల్లో ఆనందం

- తుంగభద్రకు గంటగంటకు పెరుగుతున్న వరద
- 1,12,489 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- జలాశయంలో 50.025 టీఎంసీల నీటి చేరిక
- నారుమళ్లు సిద్ధం చేసుకుంటున్న రైతులు
- నేటి నుంచి తుంగభద్ర కాలువలకు సాగునీరు విడుదల

బళ్లారి గాంధీనగర్, జూలై 18: కర్ణాటక-ఆంధ్ర రాష్ట్రాల వరదాయినిగా నిలిచిన తుంగభద్ర ఆయకట్టు రైతుల్లో ఆనందాన్ని నింపుతోంది. జలాశయం పైప్రాంతంలో భారీగా వర్షాలు కురుస్తున్న కారణంగా తుంగభద్ర జలాశయానికి అనుకున్న దానికంటే ఎక్కువ ప్రమాణంలో వరద నీరు చేరుతోంది. గత వారంలో 18వేల క్యూసెక్కులకు పడిపోయిన ఇన్‌ఫ్లో గత రెండు రోజులుగా భారీగా వరద నీరు చేరుతోంది. గురువారం సాయంత్రానికి జలాశయానికి 1,12,489 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా డ్యామ్‌లో 50.025 టీఎంసీల నీరు చేరడం అటు అధికారుల్లో, ఇటు రైతు వర్గాల్లో హర్షాతిరేకాలు కనిపిస్తున్నాయి. గత ఏడాది ఇదే సమయానికి 10.947 టీఎంసీలకే పరిమితమైంది. అధిక స్థాయిలో వరద నీరు వచ్చి చేరుతుండడతో తుంగభద్ర ఆయకట్టు రైతులు గత ఏడాది చవిచూసిన నష్టాలను గట్టెక్కే దిశలో ప్రయత్నిస్తున్నారు. తుంగభద్ర జలాశయం నుంచి బళ్లారి జిల్లా పరిధిలో వెళ్లే హెచ్చెల్సీ ఎల్లెల్సీ కాలువల పరిధిలోని కంప్లి, సిరుగుప్ప, కురుగోడు, మోకా తదితర ప్రాంతాలకు చెందిన రైతులు నారుమళ్ళు సిద్ధం చేసుకున్నారు. ఎల్లెల్సీ కాలువకు 19వ తేదీ నుంచి సాగునీటి విడుదల చేస్తున్న నేపథ్యంలో ఆయకట్టు రైతులు పంటసాగుకు పైర్లు సిద్ధం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, రైతు ప్రముఖులతో చర్చించి, తుంగభద్ర జలాశయం పరిధిలోని తుంగభద్ర, విజయనగర కాలువలకు సాగునీటిని ఈ నెల 19వ తేదీన విడుదల చేయాలని నీటిపారుదల సలహా సమితి అధ్యక్షుడు, రాష్ట్ర మంత్రి శివరాజు ఎస్.తంగడిగి సూచనల మేరకు తుంగభద్ర, విజయనగర కాలువలకు ఖరీఫ్ సీజన్‌లో వేళాపట్టిలో పొందుపరిచిన విధంగా సాగునీటిని విడుదల చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నట్లు మునిరాబాద్ తుంగభద్ర బోర్డు సర్కిల్ సూపరింటెండ్ ఇంజనీర్, నీటిపారుదల సలహా సమితి మెంబర్ సెక్రటరి ఎల్.బసవరాజు పేర్కొన్నారు. బోర్డు నిర్ణయం మేరకు తుంగభద్ర ఎడమ ప్రధాన కాలువలకు జూన్ 19 నుంచి సరాసరి 4100 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తుంగభద్ర ఎడమ హెచ్చెల్సీ కాలువకు 19వ తేదీ నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు 25 క్యూసెక్కులు, తుంగభద్ర కుడి దిగువ కాలువకు జూలై 19వ తేదీ నుంచి 650 క్యూసెక్కులు, తుంగభద్ర కుడి హెచ్చెల్సీ కాలువకు జూన్ 22 నుంచి 1300 క్యూసెక్కులు, రాయసబవణ్ణ కాలువకు ఇప్పటికే జూన్ 1వ తేదీ నుండి 180 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. నదిమూలంగా వెయ్యి క్యూసెక్కులు, ఫ్యాక్టరీలకు 60 క్యూసెక్కులు నీటి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. తుంగభద్ర జలాశయంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటి ఆధారంగా సాగుకు విడుదలచేస్తున్నట్లు, ఆయకట్టు రైతులు మితంగా సాగునీటిని ఉపయోగించుకోవాలని బోర్డు అధికారులు కోరుతున్నారు. ప్రస్తుతం తుంగభద్ర జలాశయానికి వచ్చి చేరుతున్న వరదనీటిపైనా ఆధారపడిందని, ముందు జలాశయానికి చేరే నీటి ప్రమాణంలో కొరత ఏర్పడితే ప్రస్తుతం నీటి విడుదలపై మరోసారి ప్రకటన జారీ చేస్తున్నట్లు బోర్డు అధికారులు తెలిపారు.




నాట్ల కోసం వరినారును కట్టలు కడుతున్న మహిళలు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1614.31	1,589.90
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	82,491	11,425
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	300	262
సామర్థ్యం (టీఎంసీలు)	46.80	10.95

రాఘవేంద్ర బృందావనంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో రాఘవేంద్రస్వామి బృందావనం

కంప్లి, జూలై 18: కంప్లి పట్టణం సత్యనారాయణపేటలోని రాఘవేంద్ర బృందావనంలో ఆషాఢమాస గురువారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు బృందావనాన్ని అలంకరించి పూజలు, పల్లకిసేవ, తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఆషాఢమాసం సందర్భంగా స్వామివారికి ప్రత్యేకపూలతో అలంకరణ చేపట్టారు.

జాలీహాల్‌లో ఘనంగా మొహరం

బళ్లారి సిటీ,జూలై 18: తాలూకాలోని జాలీహాల్ గ్రామంలో పదిరోజుల మొహర్రం పండుగ వేడుకలకు బుదవారంతో తెరపడింది. ఈ తాలూకాలోని గ్రామాలలో ఒక ప్రత్యేకమైన ఆచారం ఉంది. పండగ జరిగే పదిరోజులు చెప్పులు వేసుకోకుండా, మద్య, మాంసాహారం తీసుకోకుండా, పీర్లను పూజిస్తారు. ఇక్కడ పీర్ల దేవతల ప్రత్యేక అలంకరణ అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. బుధవారంతో ఊరేగింపును భక్తిశ్రద్ధలతో ముగించారు.

అభివృద్ధికి నోచుకోని సన్నాపురం కాలువ



ముళ్లకంపలతో నిండిపోయిన ఒకటో డిస్ట్రిబ్యూటరీ

కంప్లి, జూలై 18: తుంగభద్ర జలాశయం ఎల్ఎల్‌సీ కింద ఒకటవ డిస్ట్రిబ్యూటరీ సన్నాపురం కాలువ ముళ్ల కంపలతో నిండిపోయి పూర్తిగా అభివృద్ధికి బారెడు దూరంలో వుంది. ఈ ఉపకాలువ కింద సుమారు 20 తూములకు పైగా ఉన్నాయి. నెంబర్ 10 ముద్దాపురం, కొట్టాల్, బెళగోడుహాళ్, సన్నాపురం, బసవేశ్వర క్యాంపు, నారాయణ స్వామి క్యాంపు గ్రామాలకు సుమారు పది కిలోమీటర్ల పొడవునా ఈ కాలువ ద్వారా నీరు అందించాల్సి ఉంటుంది. ఈ కాలువ కింద ఖరీఫ్, రబీలో ఐదు వేల ఎకరాల్లో పంటలు పండిస్తున్నారు. నాలుగేళ్ల క్రితం కాలువ పునరుద్ధరణ పనులు జరిగాయి కానీ అభివృద్ధి పనుల్లో నాణ్యతలేక తూములన్నీ శిథిలావస్థకు చేరుకుని ధ్వంసమయ్యాయి. ఇప్పటికే అధికారులు ఈనెల 19 నుంచి 650 క్యూసెక్కుల నీరు సాగుకు విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువలకు నీరు రాకముందే కాలువలో ముళ్లకంపలు తొలగించి అభివృద్ధి పనులు జరిపాలని రైతులు కోరుతున్నారు.

కంప్లి 8వ వార్డులో సమస్యల తిష్ట



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్

కంప్లి, జూలై 18 : కంప్లి పురసభలోని 8వ వార్డుకు చెందిన సుదర్శన్‌రెడ్డి తమ వార్డులో అభివృద్ధి జరగడంలేదని, మౌలిక సదుపాయాలు లేకుండా పోయాయని జిల్లా అధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రాకు గురువారం వినతి పత్రం ఇచ్చారు. వార్డు సమస్యలను ఎన్నోసార్లు అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడంలేదని తెలిపారు. త్వరలోనే డీఎంఎఫ్ నిధులతో వార్డులో సీసీరోడ్లు, మురుగు కాలువలు, ఐమాక్స్ లైట్లు, వీధిదీపాలు ఏర్పాటు చేసి సమస్యలు లేకుండా చర్యలు చేపడతామని జిల్లా అధికారి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

పీర్ల ఊరేగింపులో అపశృతి

- రేకులషెడ్డు వంగి కిందకు పడిపోయిన భక్తులు
- తొక్కిసలాటలో 28 మందికి గాయాలు



రేకులషెడ్డుపై కూర్చున్న భక్తులు

బళ్లారి, జూలై 18(ఆంధ్రజ్యోతి): బళ్లారి నగరం కౌల్‌బజార్- గుగ్గరహట్టి దారిలో ఉండే బడీ ఈద్గా సమీపంలో గురువారం పీర్ల ఊరేగింపులో అపశృతి చోటుచేసుకుంది. పీర్లను చూసేందుకు రోడ్డుపక్క నుంచే రేకులషెడ్డుపై పెద్ద సంఖ్యలో జనం ఎక్కారు. ఆ సమయంలో రేకులషెడ్డు ఒక్కసారిగా కిందకు వంగిపోయింది. దీంతో షెడ్డుపై నిలుచుని అక్కడ పీర్లను తిలకిస్తున్న భక్తులు కిందకు పడిపోయారు. కిందనున్నవారిపై రేకులపైనుండే భక్తులు ఒక్కసారిగా పడడంతో తొక్కిసలాట జరిగింది. ఈ ప్రమాదంలో సుమారు 28 మంది గాయాలకు లోనయ్యారు. వీరిని వెంటనే అక్కడ ఉండే పీహెచ్‌సీలో చేర్పించగా, మరి కొందరిని విమ్స్ ట్రామాకేర్‌కు తరలించారు. కొందరికి గాయాలు తగిలినా స్వామి అంగారు అంటించుకుని ఇంటికి వెళ్లిపోయారు. మరికొందరు విమ్స్ ఆసుపత్రిలో చేరారు. సలీబ్ బీ, ఫాతీమా బీ అనే ఇద్దరు మహిళలకు తీవ్రగాయాలు కావడంతో వీరు విమ్స్‌లో వైద్యం పొందుతున్నారు.

బండిహట్టి సమీపంలోని హల్దాల్లిలో ఉండే సర్దార్ ఉసేన్ పీరా పీర్లను ఈద్గా సమీపంలోని జగదాంబ కాలనీ వద్ద వరకూ ఊరేగించడం ఆనవాయితీ. ఆ సమయంలోనే ఈ ఘటన జరిగింది. వెంటనే కౌల్‌బజార్ పోలీసులు, అక్కడ ఉండే ప్రజలు గాయపడిని వారికి ఆసుపత్రిలో చేర్చడానికి సహకరించారు.



రేకులషెడ్డు వంగి కిందకు పడిపోతున్న భక్తులు

పరీక్షాకేంద్రాల చుట్టూ నిషేధాజ్ఞలు: డీసీ



బళ్లారి సిటీ, జూలై 18: బెంగళూరులోని కర్ణాటక సిటీ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ రిక్రూట్‌మెంట్ల కోసం నిర్బంధ కన్నడభాషా పరీక్ష ఈ నెల 20న నగరంలోని మూడు పరీక్షా కేంద్రాల్లో మధ్యాహ్నం 2గంటల నుండి 4-30గంటల వరకు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా తెలిపారు. పరీక్షా కేంద్రాల చుట్టూ ఉన్న 200మీటర్ల ప్రాంతంలో నిషేధాజ్ఞలు విధించినట్లు ఆయన తెలిపారు. పరీక్షా కేంద్రాల చుట్టుపక్కల జిరాక్స్ ఇంటర్‌నెట్ సెంటర్లను మూసివేయాలని ఆదేశించారు.

విధులు సక్రమంగా నిర్వహించాలి:ఎస్పీ



కంప్లి పోలీస్ స్టేషన్ సిబ్బందితో ఎస్పీ

కంప్లి, జూలై 18: పోలీస్ స్టేషన్‌లో వుండే అధికారులు గానీ, పోలీసులు గానీ తమ విధులు సక్రమంగా నిర్వహించినప్పుడే వారికి గుర్తింపు వుంటుందని ఎస్పీ వీజే శోభారాణి తెలిపారు. ఆమె గురువారం ఆకస్మికంగా కంప్లి పోలీస్ స్టేషన్‌ను తనిఖీచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తరచుగా జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో వుంచుకుని పలుచోట్ల వాహనాల వేగ నియంత్రణ మిషన్లను ఏర్పాటు చేశామన్నారు. అలా వేగంగా వెళ్లే వాహనాల పై చర్యలు తీసుకుని కేసులు నమోదు చేశామన్నారు. అనంతరం పోలీసు క్వార్టర్స్ పరిశీలించిన ఆమె వాటికి మరమ్మతులు జరిపి పోలీసు సిబ్బందికి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చేస్తామన్నారు. అలాగే శ్రీరామరంగాపురం, ఎమ్మిగనూరు గ్రామాలలో కేసులను పరిశీలించి జనసంఖ్యను దృష్టిలో వుంచుకుని అక్కడ ఉపపోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామాల్లోని ప్రజలు పోలీసు శాఖతో సహకరించినప్పుడే నేరాలు అరికట్టవచ్చునన్నారు. తమ చుట్టూ జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలపై వెంటనే పోలీస్ స్టేషన్‌లో అధికారులకు ఫిర్యాదుచేసి కేసులు నమోదు చేయాలన్నారు. వారితో పాటు డీవైఎస్పీ ప్రసాద్ గోఖలే, సీఐ వాసుకుమార్, ఎస్ఐ లింగప్ప, ఏఎస్ఐ వెంకోబరావు, బసవరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పక్షుల అభయారణ్యంలో పశువుల బెడద

అంకసముద్రంలో స్వేచ్ఛగా తిరుగుతున్న పశువులు

బళ్లారి సిటీ,జూలై 18: హగరిబొమ్మనహళ్ళి తాలూకాలోని అంకసముద్రం పక్షి సంరక్షణ కేంద్రంలో ప్రతిరోజు ఫారెస్ట్‌గార్డులకు, గోసంరక్షకులకు మధ్య ఘర్షణలు కొనసాగుతున్నాయి. సరస్సు ప్రాంతంలోకి పశువులు ప్రవేశిస్తున్నాయి. దీంతో గూళ్లు విడిచిపెట్టిన పెయింటెడ్ కొంగ, ఇండియన్ కార్మోరెంట్, గ్రేట్ కార్మోరెంట్, పెలికాన్, ఐబీస్ తదితర పక్షుల జీవనం ఇబ్బందులను ఎదుర్కొంటోంది. పశువులు ఆప్రాంతంలోకి రాగానే వందలాది పక్షులు ఉలిక్కిపడి పైకి ఎగిరిపోతున్నాయి. దీంతో పశువుల కాపరులు, కాపలాదారుల మధ్య నిత్యం గొడవలు జరుగుతూనే ఉన్నాయి. పక్షుల పరిశీలకులు మాత్రమే వినియోగించే ఆ శాఖకు చెందిన బైనాక్యులర్లను ఇప్పుడు పశువుల ఆక్రమణలపై నిఘా పెట్టడానికి వినియోగిస్తున్నారు.

244 ఎకరాల ఏరియలో నరేగా, అటవీ శాఖ ప్రత్యేక గ్రాంట్ కింద 1.7కి.మీ ఎన్‌క్లోజర్‌ను చైన్‌లింక్ మెష్‌తో నిర్మించారు. మరో 3కి.మీ. పని పెండింగ్‌లో ఉంది. పూర్తి ఎన్‌క్లోజర్‌ను నిర్మించకపోవడంతో పక్షి అభయారణ్యంలోకి ప్రజలు, పశువులు అక్రమంగా ప్రవేశించడం సులభంగా మారింది. సరస్సు ప్రాంతం పక్కనే ప్రవేశ ద్వారం వద్ద కూడా ప్రహరి గోడ నిర్మించలేదు. ఎక్కడిక్కడే ఆక్రమణలకు గురవుతుండటంతో పక్షుల నివాసం ఆందోళన కలిగిస్తోంది. 25కంటే ఎక్కువ జాతుల గబ్బిలాలు ఈస్థలాన్ని సంతానోత్పత్తికి ఎంచుకున్నాయి. అక్టోబర్ నెల నుండి దేశం నలుమూలల నుండి పక్షులు ఇక్కడికి వలస వస్తాయి. 8కి.మీ చుట్టుకొలత ప్రాంతంలో అటవీశాఖ ముగ్గురు గార్డులను నియమించింది.



మేతకు వచ్చిన పశువులు



పక్షుల విడిదిగా అంకసముద్రం

వర్షాకాలం కావడంతో ఇక్కడ గడ్డి బాగా పెరిగింది. దీంతో పశువులు, గొర్రెలను మేపేందుకు వచ్చే కాపరులతో రోజు వాగ్వాదం జరగడంతోపాటు ఘర్షణలు కూడా చోటుచేసుకుంటున్నాయి. వివాదాలు తలెత్తకుండా పూర్తిస్థాయిలో ప్రహరీ గోడ నిర్మించాలని, అటవీశాఖ అధికారులు దృష్టి సారించి ప్రత్యేక గ్రాంట్ విడుదల చేయాలని పక్షి ప్రేమికుడు ఆనంద్ బాబు కోరుతున్నారు. పెండింగ్‌లో ఉన్న లింక్ మెష్‌ని నిర్మించడానికి మరో రూ. 1.5కోట్ల గ్రాంట్ అవసరమని, ఈమేరకు అధికారులకు వినతి పత్రం అందించామని సబ్‌జోన్ అటవీ అధికారి కరిబసప్ప తెలిపారు.

తుంగ, భద్ర నదులకు వరదపోటు

బళ్లారి గాంధీనగర్, జూలై 18: శృంగేరి ఆగుంబె, తీర్థహళ్ళి ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా శివమొగ్గ జిల్లాలోని గాజనూరులో ఉన్న తుంగ జలాశయానికి వరద పోటు ఎక్కువైంది. దీంతో జలాశయ భద్రత దృష్ట్యా డ్యాం 22 క్రస్ట్‌గేట్ల గుండా 80వేల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రస్తుతం జలాశయానికి 24గంటల వ్యవధిలో 71,864 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా, 588.24 అడుగుల నీరు చేరింది. శివమొగ్గ నగరంలోని ఇమామ్ బాడ, బాపూజీ నగర్‌లతో పాటు నదీతీర ప్రాంతాలైన జనవసతి ప్రాంతాలు అన్ని నీటిలో మునిగిపోయాయి. గంటగంటకు వరద ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో శివమొగ్గ కార్పొరేషన్ మూడు చోట్ల గంజికేంద్రాలను ప్రారంభించింది.

భద్ర జలాశయానికి రికార్డు స్థాయిలో వరద నీరు.

చిక్కమంగళూరు జిల్లా పరిధిలో భారీగా వర్షాలు కురుస్తున్న కారణంగా లక్కవళ్ళివద్ద నిర్మించిన భద్ర జలాశయానికి భారీ ప్రమాణంలో వరద నీరు వచ్చి చేరుతున్నట్లు భద్ర జలాశయం బోర్డు అధికారులు తెలిపారు. ప్రస్తుతం 43వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా, ఈ ప్రమాణం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు వివరించారు. 24గంటల వ్యవధిలో జలాశయానికి 42,165 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా, ఒకే రోజు 4.4 అడుగుల మేర నీటిమట్టం పెరిగింది. 186 అడుగుల గరిష్ఠ ఎత్తుకలిగిన భద్ర జలాశయంలో ప్రస్తుతం నీటినిల్వ 153 అడుగులకు చేరింది.



తుంగ జలాశయం నుంచి కిందకు దూకుతున్న నీరు

ఉత్తమ మార్గంలో నడవాలి



మాట్లాడుతున్నబ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయ కన్వీనర్ పూర్ణిమ

సిరుగుప్ప, జూలై 18: ప్రతిఒక్కరు ఉత్తమ జీవిత మార్గంలో వెళ్లాలని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయ కన్వీనర్ పూర్ణిమ తెలిపారు. గురువారం సిరుగుప్ప పట్టణంలోని లక్ష్మీవెంకటేశ్వర కళ్యాణమండపంలో జీవన దర్శన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖరయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా కన్వీనర్ పూర్ణిమ మాట్లాడుతూ వ్యక్తి జీవిత మార్గంలో ఎన్నో సమస్యలు ఎదురవుతాయని, వాటిని ఎదుర్కొని ఉత్తమ జీవిత మార్గాన్ని ఎన్నుకోవాలని తెలిపారు. భక్తి, శ్రద్ధ, లక్ష్యం మనిషికి అత్యవసర మార్గాలని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా బసవ భూషణ స్వాములు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చొక్కా బసవన్నగౌడ, బీజేపీ యువ నాయకులు ధరప్ప నాయక, న్యాయవాది గుండళ్లి, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

థర్మల్ ప్లాంట్‌లో బయోమాస్ వినియోగంపై అవగాహన

- హగరి ఐసీఏఆర్ అగ్రికల్చరల్ సైన్స్ సెంటర్‌లో డైరెక్టర్ సతీష్

బళ్లారి సిటీ, జూలై 18: హగరిలో గురువారం సమర్థ మిషన్ కింద థర్మల్ పవర్ ప్లాంట్‌లో బయోమాస్ వినియోగంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జ్యోతివెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించిన మిషన్ డైరెక్టర్ సతీశ్ ఉపాధ్యాయ మాట్లాడుతూ, వ్యవసాయ అవశేషాలను వివిధ ఫ్యాక్టరీల్లో ఉపయోగించడాన్ని ప్రోత్సహించడం, సులభతరం చేయడం వల్ల బయోమాస్ రవాణా, ఉత్పత్తి సరఫరా, కో-ఫైరింగ్ కోసం పర్యావరణ వ్యవస్థ అభివృద్ధి చెందుతాయని అన్నారు. పంట అవశేషాల నిర్వహణ కోసం జాతీయ విధానం అవసరమన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ కోసం థర్మల్ పవర్ ప్లాంట్‌లలో కో-ఫైరింగ్ ద్వారా విద్యుత్తు ఉత్పత్తికి బయోమాస్ వినియోగించాలన్నారు. వ్యవసాయరంగానికి ఇది ఎలా దోహదపడుతుందనే విషయంపై మార్గదర్శనం చేశారు. ఎన్‌పీటీఐ జనరల్ డైరెక్టర్ ఠాకూర్ మాట్లాడుతూ వ్యవసాయ అవశేషాలను ఉద్దేశపూర్వకంగా ఉపయోగించడం, సంపాదన సామర్థ్యాన్ని పెంచుకోవడానికి ఆదర్శవంతమైన మార్గాన్ని అందించిందన్నారు. రైతులు ఈకార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈసందర్భంగా ఎన్‌పీటీఐ డైరెక్టర్ జనరల్ మంజుమామ్, మిషన్ సభ్యులు ప్రఫుల్ చంద్ర,రవిశంకర్, హగరి అగ్రికల్చర్ సైన్స్ సెంటర్ హెడ్ డాక్టర్ గోవిందప్ప, 250మంది దాక రైతులు, ఎన్‌పీటీఐ డైరెక్టర్ సంజయ్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

రాయచూరు, జూలై 18: నగరంలోని ఎస్ఎస్ఆర్‌జీ మహిళా కళాశాలలో గురువారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం రక్తదానశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదానంతో పాటు రక్త నమూనాల సేకరణ, బ్లడ్ గ్రూప్ వివరాలకు సంబంధించి పరీక్షలు నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన ఐఆర్‌సీఎస్ రాష్ట్ర శాఖ చైర్మన్ విజయ్ కుమార్ పాటిల్ శావంతగేరే రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న వైద్య సేవలగురించి వివరించారు. సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని వీరశైవ కల్యాణ మండపంలో ఇప్పటికే బ్లడ్‌బ్యాంక్ ఏర్పాటు చేశామని దీన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాగా రక్తదాన శిబిరాలను విజయవంతం చేసేందుకు యువకులు, విద్యావంతులు ముందుకురావాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటప్ప నాయక్, పాలక మండలి కార్యదర్శి రతిలాల్ పటేల్, రెడ్‌క్రాస్ యూత్ విభాగం వర్కింగ్ కార్యదర్శి త్రివేణి తదితరులున్నారు.

హోసూరు జోన్

ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన మహిళలు



సక్రమంగా తాగునీటిని సరఫరా చేయాలని రాస్తారోకో చేస్తున్నమహిళలు

హోసూరు, జూలై 18: హోసూరు సమీపంలోని తిమ్మచంద్రంలో గత మూడు నెలలుగా తాగునీరు సక్రమంగా పంపిణీ చేయడంలేదని మహిళలు ఖాళీబిందెలతో రోడ్డెక్కారు. హోసూరు కార్పొరేషన్‌లో 45 వార్డులున్నాయి. తొమ్మిదో వార్డు పరిధిలోని తిమ్మచంద్రంల్లో 150 కుటుంబాలు నివసిస్తున్నాయి. గత మూడు నెలలుగా ఇక్కడ సరైన తాగునీరు పంపిణీ చేయడం లేదని ఆరోపిస్తూ హోసూరు బేరిక్రై రోడ్డుపై ఖాళీ బిందెలతో ప్రజలు రాస్తారోకో చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడిందని తెలుసుకున్న హడ్కో పోలీసులు, కార్పొరేషన్ పైప్‌లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, ఇతర అధికారులు నేరుగా అక్కడికి చేరుకుని ప్రజలతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో అందరూ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

స్కేటింగ్ పోటీల్లో విజయం సాధించిన బాలురు

హోసూరు, జూలై 18: హోసూరులో జరిగిన స్కేటింగ్ పోటీల్లో ప్రైవేట్ పాఠశాలకు చెందిన ఇద్దరు బాలురు ప్రపంచ రికార్డు సృష్టించారు. హోసూరులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతున్న నాలుగేళ్ల నందపాలన్ రఘురామన్ 33 నిమిషాల్లో ఆరు కిలోమీటర్లు దూరం స్కేటింగ్ చేసి రికార్డు సృష్టించాడు. అదేపాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న తొమ్మిదేళ్ల క్రిస్టోఫర్ చార్లెస్ స్కేటింగ్ చేస్తూ 53 నిమిషాల్లో 18 కిలోమీటర్లు ప్రయాణించి రికార్డు సృష్టించాడు. గురువారం హోసూరులో ఇండియా బుక్ ఆఫ్ గోల్డ్ రికార్డ్స్ ఎడిటర్ ఇన్ చీఫ్ డాక్టర్ కె.సద్దాంహుసేన్ సమక్షంలో జరిగిన ఈ పోటీల్లో రికార్డులు సృష్టించిన ఇద్దరు బాలురను సత్కరించి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

దళితులకు రక్షణ కల్పించాలి :దళిత సమాఖ్య



ఆర్మ్‌స్ట్రాంగ్ హత్యను ఖండిస్తూ రాస్తారోకో చేస్తున్న దళితులు

హోసూరు(సిప్‌కాట్) జూలై 18: రాష్ట్ర సరిహద్దులోని హోసూరులో ఆర్మ్‌స్ట్రాంగ్ హత్యను ఖండిస్తూ కర్ణాటక దళిత సంఘాలు రాస్తారోకో నిర్వహించాయి. దీని వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఇటీవల చెన్నైల్లో జరిగిన బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్ హత్యను ఖండిస్తూ, తమిళనాడులోని దళితులకు తగిన రక్షణ కల్పించాలని తమిళనాడు ప్రభుత్వాన్ని కోరుతూ కర్ణాటక రాష్ట్ర దళితసంఘాల సమాఖ్య తమిళనాడు సరిహద్దులోని రోడ్డులో బైఠాయించి రాస్తారోకో నిర్వహించింది. భీమా ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ హెప్పలవెంకటేష్ నేతృత్వంలో వంద మంది దళిత సంఘాల సభ్యులను కర్ణాటక రాష్ట్ర పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం మరికొందరు చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిపై బైఠాయించి ఆర్మ్‌స్ట్రాంగ్‌ను హత్య చేసిన వారిని న్యాయస్థానం ముందు నిలబెటశిక్షించాలని, చనిపోయిన అతడి కుటుంబానికి తమిళనాడు ప్రభుత్వం రూ.2 కోట్ల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. దీంతో ఆ ప్రాంతంలో గంటపాటు ట్రాఫిక్ స్తంభించింది.



స్కేటింగ్ పోటీల్లో విజయం సాధించిన రఘురామన్, క్రిస్టోఫర్ చార్లెస్

రైతు వ్యతిరేక విధానాలు వీడాలి: రైతు సంఘం



డీసీ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న రైతులు

రాయచూరు, జూలై 18 : రాష్ట్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను విడనాడి రైతు ప్రయోజనాలకు పెద్దపీట వేయాలని రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను నిరశిస్తూ గురువారం జిల్లాధికారి కార్యాలయం వద్ద కర్ణాటక రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లాకమిటీ నాయకులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన రైతు సంఘం నాయకులు, పంప్‌సెట్ల విద్యుత్ సరఫరాకు సంబంధించిన ఖర్చును రైతులే భరించాలని ప్రభుత్వం షరతు విధించడం శోచనీయమన్నారు. ఒక్కో పంప్‌సెట్‌కు విద్యుత్ కనెక్షన్ పొందేందుకు రూ2లక్షల వరకు వ్యయం కానుండగా అంతపెద్ద మొత్తాన్ని భరించే స్థితిలో రైతులు లేరన్నారు. గత ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 1182 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నా వాటిని నివారించడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకుండా పోయిందన్నారు. ముఖ్యంగా యువ రైతులు ఆత్మహత్యలు పాలవుతున్నా ప్రభుత్వం సాగురంగంపై దృష్టి సారించకపోవడం బాధ్యతారాహిత్యమన్నారు. దీంతోపాటే పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర అందేలా ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వర్షభావ పరిస్థితి వల్ల ఒకవైపు కరువు పరిస్థితిని ఎదుర్కొంటున్న రైతుల నుంచి బ్యాంకులు రుణాలు వసూలు చేయకుండా నియంత్రించాలన్నారు.

మృతుడి కుటుంబానికి ఎంపీ పరామర్శ

రాయచూరు, జూలై 18: జిల్లాలోని లింగసుగూరు తాలూకా హట్టి బంగారు గని కంపెనీలో ఇటీవల మృత్యువాతపడిన కార్మికుడి కుటుంబాన్ని లోకసభ సభ్యుడు జీ కుమార్‌నాయక్ పరామర్శించారు. మృతుడి కుటంబ సభ్యులనుగురువారం కలిసిన ఎంపీ, ప్రమాదవశాత్తు మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కుటుంబంలో అర్హులైన ఒకరికి ఉద్యోగం ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ విషయంలో గతంలో జరిగిన సంఘటనల గురించి కార్మికులు ఎంపీకి వివరించారు. ఎవ్వరు అధైర్యపడవద్దని కార్మికుల రక్షణ కోసం ప్రభుత్వ పరంగా అన్ని చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎంపీ హామీ ఇచ్చారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంఫ్...

స్వామి విపులానంద (వర్ధంతి)



తమిళ హిందూ సంఘ సంస్కర్త స్వామి విపులానంద 1892 మార్చి 27న శ్రీలంకలో జన్మించారు. విపులానంద అడిగల్‌గా పేరొందారు. సాహితీవేత్త, రచయిత, కవి, ఉపాధ్యాయుడు. రామకృష్ణ మిషన్‌తో ఆయనకు ఎంతో అనుబంధం ఉంది. తమిళంతోపాటు సింహళ, సంస్కృతం, ఇంగ్లీషు, లాటిన్, గ్రీకు భాషలలో ఆయనకు ప్రావీణ్యం ఉంది. షేక్‌స్పియర్ రచించిన 12 నాటకాలను అనువాదం చేశారు. స్వామి వివేకానంద, రబీంద్రనాథ్ ఠాగూర్ తదితర ప్రముఖుల రచనలను ఆంగ్లంలోకి అనువాదం చేశారు. సంగీతం, సంగీత పరికరాల అంశాలపై పరిశోధనలు చేశారు. శ్రీలంకలో ఎన్నో ఇన్‌స్టిట్యూషన్స్‌కు ఆయన పేరు పెట్టారు. 1947 జూలై 19న కన్నుమూశారు.

రాజేంద్రప్రసాద్ (పుట్టినరోజు)



నటకిరీటిగా పేరొందిన రాజేంద్రప్రసాద్ 1956 జూలై 19న కృష్ణా జిల్లా నిమ్మకూరులో జన్మించారు. తెలుగు సినీనటుడు, నిర్మాత, సంగీత దర్శకుడు. 35ఏళ్ల కెరీర్‌లో 200కుపైగా సినిమాలలో నటించారు. ప్రధానంగా హాస్యపాత్రలో రాణించి హాస్య కిరీటిగా పేరొందారు. అహనా పెళ్ళంట, లేడీస్ టైలర్, ఎర్రమందారం, పెళ్లి పుస్తకం, మేడం, రాజేంద్రుడు - గజేంద్రుడు, ఆ నలుగురు వంటి సినిమాలు ఎంతో పేరు తెచ్చాయి. 'క్విక్ గన్ మురుగన్' ఆంగ్ల సినిమాకు ఐఐఎఫ్ఏ ఫిల్మ్ ఫెస్టివల్‌లో గుర్తింపు దక్కింది. 4 నంది అవార్డులు 3 సైమా అవార్డులు, 3 సంతోషం ఫిల్మ్ అవార్డులు ఇతరత్రా గౌరవాలు అందుకున్నారు. ఆంధ్రా యూనివర్శిటీచే గౌరవ డాక్టరేట్ పొందారు.

బెనడిక్ట్ కంబెర్‌బ్యాచ్ (పుట్టినరోజు)



'బ్రిటీష్ కల్చరల్ ఐకాన్'గా గుర్తింపు పొందిన ఆంగ్ల నటుడు బెనడిక్ట్ టిమోతి కార్ల్‌టన్ కం బెర్‌బ్యాచ్ 1976 జూలై 19న ఇంగ్లండ్ దేశంలోని హామర్‌స్మిత్‌లో జన్మించారు. ఎమ్మీ అవార్డు, బాఫ్టా, ఒలివర్ అవార్డుతోపాటు పలు పురస్కారాలు అందుకున్నారు. 2014లో టైమ్ మ్యాగజైన్‌లో ప్రపంచంలో వందమంది ప్రముఖుల జాబితాలో చోటు దక్కించుకున్నారు. 2010-17 మధ్య బీబీసీ సిరీస్ 'షెర్లాక్ హోమ్స్' తో అంతర్జాతీయ గుర్తింపు పొందారు. ఏవెంజర్స్ సిరీస్, స్పైడర్ మ్యాన్‌లలో సూపర్ హీరోగా నటించారు. మేడమ్ టస్సాడ్ మ్యూజియంలో ఆయన మైనపు విగ్రహం ఉంది.

ప్రజలకు మెరుగైన సేవలు

సమస్యల పరిష్కారానికి కార్యాచరణ

నూతన ఎస్పీ మురళీ కృష్ణ.. బాధ్యతల స్వీకరణ



అనంతపురం క్రైం, జూలై 18: జిల్లా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని ఎస్పీ కేవీ మురళీ కృష్ణ అన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు అధిక ప్రాధాన్యం ఇస్తామని, సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని తన చాంబర్‌లో గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పోలీస్‌కాన్ఫరెన్స్ హాల్‌లో విలేకరులతో మాట్లాడారు. అనకాపల్లి ఎస్పీగా 15 నెలలు పనిచేశానని, ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా పటిష్ఠ చర్యలు చేపట్టామని అన్నారు. ప్రతిష్ఠాత్మకమైన అనంతపురం జిల్లాలో ఎస్పీగా బాధ్యతలు తీసుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. తనకు అవకాశమిచ్చిన సీఎం చంద్రబాబు, డీజీపీ ద్వారకా తిరుమలరావుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వ ప్రాధాన్యతల మేరకు బేసిక్ పోలీసింగ్‌లో భాగమైన అంశాలపై దృష్టి పెడతామని అన్నారు. గంజాయి నియంత్రణకు గట్టి చర్యలు తీసుకుంటామని అన్నారు. గంజాయి రవాణా, విక్రేతలు, వినియోగదారులను గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయమని, నిష్పక్షపాతంగా, చట్టపరంగా వ్యవహరిస్తామని అన్నారు. శాంతిభద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మహిళలు, చిన్నారుల పట్ల అనుచితంగా ప్రవర్తించినా, వారిపై నేరాలకు పాల్పడినా కఠిన శిక్షలు పడేలా చూస్తామని అన్నారు. మెరుగైన సేవల కోసం స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, కళాశాలలు, పరిశ్రమల యాజమాన్యాల సహకారం తీసుకుంటామని అన్నారు. పోలీస్ సిబ్బంది, అధికారులు, వారి కుటుంబాల సంక్షేమంపై దృష్టి సారిస్తామన్నారు. అనంతరం కలెక్టర్ వినోద్‌కుమార్, డీఐజీ షిమోషిని ఎస్పీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఏఎస్పీలు విజయభాస్కర్‌రెడ్డి, రామకృష్ణ, పోలీస్ అధికారులు ఎస్పీకి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. డీఎస్పీలు ప్రతాప్, శ్రీనివాసులు, శివభాస్కర్ రెడ్డి, జనార్దన్‌నాయుడు, శివారెడ్డి, ఏఆర్ డీఎస్పీ మునిరాజు, పోలీస్ కార్యాలయ ఏఓ శంకర్, సీఏలు ఇందిర, షేక్ జాకీర్, రెడ్డప్ప, క్రాంతికుమార్, ధరణికిషోర్, ప్రతాప్‌రెడ్డి, నారాయణరెడ్డి, ఇస్మాయిల్, తదితరులు ఎస్పీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రెవెన్యూ తప్పిదాలు.. విద్యార్థులకు తిప్పలు

- ఆదాయ ధ్రువీకరణ పత్రాల్లో గందరగోళం
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అనర్హతగా గుర్తింపు
- బీటెక్ ప్రవేశ విద్యార్థుల్లో ఆందోళన
- సవరణకు ప్రభుత్వం అవకాశం
- హెల్ప్‌లైన్ సెంటర్లలో మార్పునకు చర్యలు

అనంతపురం సెంట్రల్, జూలై 18: రెవెన్యూ అధికారులు చేసిన తప్పిదాల వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కనీస పరిశీలన లేకుండా ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జారీచేయడంతో చాలామంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హత కోల్పోయారు. బీటెక్ కోర్సులు అభ్యసిస్తున్న పేద విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తుంది. ఇందుకు అర్హత సాధించాలంటే ఈఏపీసెట్ కౌన్సిలింగ్‌లో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. ధ్రువీకరణ పత్రాలు జారీచేసే సచివాలయాల్లో దరఖాస్తుదారుల వివరాల నమోదులో క్రమపద్ధతిని పాటించలేదు. తండ్రికి బదులుగా విద్యార్థి పేరుతో ఇన్‌కమ్ సర్టిఫికెట్స్‌ను జారీ చేశారు. దీంతో ఈఏపీసెట్ కౌన్సిలింగ్‌లో సర్టిఫికెట్లను తిరస్కరించారు. వెరసి అనేకమంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అనర్హులుగా మిగిలిపోయారు. సీట్ అలాట్‌మెంట్‌లో ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆప్షన్ నో అని రావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో అర్హులైన పేద విద్యార్థులందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం భరోసానిచ్చింది. మరోసారి ఆదాయ ధ్రువపత్రాలను సమర్పించేందుకు హెల్ప్‌లైన్ సెంటర్లను అందుబాటులో ఉంచింది.

ఇలా సరిదిద్దుకోవాలి..

ఆదాయ ధ్రువీకరణ ప్రతంలోని 'ఇన్‌కమ్ ఫ్రమ్ ఆల్ సోర్సెస్ ఆఫ్' అన్న తర్వాత తండ్రి పేరు ఉండాలి. ఆ తరువాత 'ఫాదర్ ఆఫ్, మదర్ ఆఫ్'గా విద్యార్థి పేరు ఉండాలి. అయితే తండ్రి ప్లేస్‌లో విద్యార్థి పేరు, విద్యార్థి ప్లేస్‌లో తండ్రి పేరును చేర్చడం ద్వారా విద్యార్థి ఆదాయం పొందుతున్నట్లు పత్రాలు జారీ చేశారు. ఈ క్రమంలో ఫీజు రీయింబర్స్‌మెట్‌కు సంబంధిత విద్యార్థులు రిజెక్ట్ అయ్యారు. విద్యార్థులు సచివాలయానికెళ్లి ఈ విషయాన్ని తెలియపరచి కొత్త ధ్రువీకరణ పత్రాన్ని పొందాలి. అనంతరం జేఎన్‌టీయూ పరిపాలన భవనం, అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈఏపీసెట్ హెల్ప్‌లైన్ సెంటర్‌ను సంప్రదించి సమర్పించాలి. అక్కడి అధికారులు సంబంధిత విద్యార్థికి ఫీజు రీయింబర్స్‌మెంట్ అర్హులుగా నమోదు చేస్తారు.

కంగారు పడ్డా



నా కుమార్తెకు అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో సీటు అలాట్ అయింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాదని చెప్పడంతో కంగారు పడ్డాను. ఇలా ఎందుకని ఆరా తీస్తే.. ఇన్‌కమ్ సర్టిఫికెట్ ఇవ్వలేదన్నారు. ఇన్‌కమ్ సర్టిఫికెట్ ఇచ్చాం. ఈ సర్టిఫికెట్స్‌లో పేర్లను తారుమారు చేశారు. నాపేరుకు బదులుగా నా కూతురు పేరు ఉందని చెప్పారు. దీంతో మళ్లీ సర్టిఫికెట్స్‌ను తీసుకువచ్చి హెల్ప్‌లైన్ సెంటర్‌లో ఇవ్వడంతో ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హత వచ్చింది. ఇందుకు ప్రభుత్వం చొరవ మరువలేం.

-మురళి, విద్యార్థిని తండ్రి, పులివెందుల

సవరణకు అవకాశం



మాలాంటి పేదలందరికీ బీటెక్‌లో ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించేలా ఇన్‌కమ్ సర్టిఫికెట్ సవరణ అవకాశాన్ని ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు. నా కుమారుడికి ఎస్ఆర్ఐటీలో సీటు వచ్చింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆప్షన్‌లో అనర్హతగా తేల్చారు. ఇదేంటని అధికారులను ప్రశ్నించగా కౌన్సిలింగ్‌లో కుల ధ్రువీకరణ పత్రాన్ని తప్పుగా ఇచ్చివుంటారన్నారు. వెంటనే సచివాలయానికెళ్లి తప్పుల్లేని ఇన్‌కమ్ సర్టిఫికెట్‌ను తీసుకువచ్చి హెల్ప్‌లైన్ సెంటర్‌లో ఇచ్చాను. దీంతో ఫీజు రీయింబర్స్‌మెంట్ వచ్చేలా ఆప్షన్ ఇచ్చారు.

-లాలెప్ప, విద్యార్థి తండ్రి, అనంతపురం

వయోజన బీసీజీ టీకాతో సురక్షితం



కదిరి అర్బన్, జూలై 18: క్షయ రహిత సమాజం కోసం కేంద్ర ప్రభుత్వం, టీబీ ముక్త భారత్ కార్యక్రమాన్ని చేపట్టింది. క్షయవ్యాధి నిర్మూలన కోసం బీసీజీ కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టింది. టీకా సురక్షతమని, ఎటువంటి చెడు ప్రభావాలు లేవని, ప్రతి ఒకరూ తప్పకుండా ఈ టీకా వేయించుకొని క్షయవ్యాధి నుంచి విముక్తి పొందాలని వైద్యులు సూచిస్తున్నారు. క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది ఇంటింటికెళ్లి టీకాలు వేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని ఆగస్టు 15 వరకు నిర్వహిస్తారు. ప్రతి గురు, సోమవారాల్లో టీకాలు వేస్తున్నారు.

ఈ లక్షణాలున్న వారికి తప్పనిసరి

ఈ లక్షణాలున్న ప్రతి ఒకరు బీసీజీ టీకాలు వేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఐదేళ్లలో టీబీ వచ్చితగ్గిపోయినవారు తప్పకుండా ఈ టీకా వేయించుకోవాలి. అలాగే 60 సంవత్సరాలు నిండిన, పొగతాగేవారు, షుగర్ వ్యాధిగ్రస్తులు, బీఎంఐ (శరీర ద్రవరాశి సూచిక, లేక ఎత్తుకు తగ్గిన బరువు) 18 కంటే తక్కువ ఉండేవారు, టీబీ రోగులతో సన్నిహిత సంబంధాలు ఉన్నవారు తప్పకుండా ఈ టీకా వేయించుకోవాలని సూచిస్తున్నారు.

వీరికి ఈ టీకా వద్దు

టీబీ వ్యాధి ఉండి, మందులు వాడుతున్నవారు, గర్భవతులు, పాలు ఇచ్చే తల్లులు, హెచ్ఐవీ, ఎయిడ్స్ రోగులు ఈ టీకా వేయించుకోరాదు. అంతేకాకుండా 18 సంవత్సరాలు నిండనివారు... రక్తదానం చేసిన మూడు నెలల వరకు టీకా వేయించుకోరాదు.

క్షయవ్యాధి అంటే..

క్షయవ్యాధి.. మైక్రో బ్యాక్టీరియా ట్యూబర్‌క్యూలోసిస్ అనే బ్యాక్టీరియా ద్వారా వ్యాపించే అంటువ్యాధి, ఈ వ్యాధి స్త్రీ, పురుషులకు వయస్సుతో సంబంధం లేకుండా వస్తుంది. ఈ వ్యాధి శరీరంలోని ఏ అవయవానికైనా రావచ్చు. ముఖ్యంగా ఊపిరితిత్తులకు ఎక్కువగా సోకుతుంది. క్షయవ్యాధి రోగి దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు క్రిములు గాలిలో తుంపర్లుగా వెళ్లుతాయి. వీటిని ఆరోగ్యవంతులు పీల్చినప్పుడు ఈ వ్యాధి వారికి వ్యాపిస్తుంది. ఈ వ్యాధి నివారణకు, పుట్టిన పసిబిడ్డలకు బీసీజీ టీకాలు ఇప్పించాలి. క్షయ రోగి ఎక్కడబడితే అక్కడ ఉమ్మివేయరాదు. క్షయ రోగులు క్రమం తప్పకుండా మందులు వాడాలి.

క్షయవ్యాధితో అప్రమత్తంగా ఉండాలి



క్షయవ్యాధి పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలి. ఈవ్యాధికి చిన్న, పెద్ద, స్త్రీ, పురుషులు అనే తేడా లేకుండా అందరికి సోకుతుంది. భవిష్యత్‌లో టీబీ రాకుండా ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన వయోజన బీసీజీ టీకా సురక్షితమైంది. క్షయకు వ్యతిరేకంగా రోగనిరోధక శక్తిని మరింత పెంచడానికి, పెద్దల్లో టీబీ నుంచి రక్షణ ఇవ్వడానికి ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టింది. క్షయను నిర్మూలించేదుకు ప్రతి ఒకరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలి.

- డాక్టర్ నాగేంద్రనాయక్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ

పురం మున్సిపాలిటీలో

బిల్లుల కలకలం..!



మాజీ కమిషనర్‌పై చైర్‌పర్సన్ అవినీతి ఆరోపణలు

ఏసీబీకి ఫిర్యాదు... ఆలస్యంగా వెలుగులోకి..

హిందూపురం, జూలై 18: మున్సిపాలిటీలో బిల్లుల చెల్లింపు వ్యవహారం కలకలం రేపింది. గతంలో మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన ప్రమోద్‌కుమార్ పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడ్డాడనీ, విచారణ చేపట్టాలని ఏసీబీకి చైర్‌పర్సన్ ఇంద్రజ ఫిర్యాదు చేయడం ప్రకంపనలు సృష్టిస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా చెక్కుల రూపంలో కోట్లాది రూపాయలు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించారనీ, అందులో పర్సెంటేజీలు తీసుకున్నారని ఆమె ఆరోపించారు. కొన్ని పనులు చేయకుండానే బినామీ పేర్లతో బిల్లులు కాజేశారని అందులో పేర్కొన్నారు. ఈ మేరకు వారం క్రితం ఏసీబీకి ఫిర్యాదు చేసిన విషయం గురువారం వెలుగు చూసింది. అందుకు సంబంధించిన కాపీలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. కొంతమంది కాంట్రాక్టర్లకు సీఎఫ్ఎంఎస్ నుంచి కాకుండా నేరుగా చెక్కులు ఇవ్వడం దుమారం రేపుతోంది.



D.N. INDRAJA
Chairperson
Hindupur Municipality

రూ.కోట్లలో అక్రమాలు

మున్సిపల్ మాజీ కమిషనర్ ప్రమోద్‌కుమార్, అకౌంట్స్ విభాగంలో పనిచేస్తున్న జేఏఓ మనోహర్ కుమ్మక్కై కొంతమంది కాంట్రాక్టర్లకు నేరుగా చెక్కులు ఇచ్చారు. నిబంధనల ప్రకారం కాంట్రాక్టర్లు పనిచేస్తే వాటికి సంబంధించి సీఎఫ్ఎంఎస్‌లో బిల్లులు చేయాలి. అలాకాకుండా తమకు అనుకూలంగా ఉన్న కాంట్రాక్టర్లకు చెక్కులు రాసి ఇచ్చినట్లు చైర్‌పర్సన్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇలా రూ.2కోట్ల వరకు చెక్కులు ఇచ్చినట్లు తెలిసింది. ప్రతి బిల్లూ సీఎఫ్ఎంఎస్ ద్వారానే చెల్లించాలని నిబంధనలున్నా.. ఇలా చెక్కుల రూపంలో ఇవ్వడం దారుణమని చైర్‌పర్సన్ ఆరోపించారు.

కలెక్టర్ ఆదేశించినా విచారణ శూన్యం

గతేడాది డిసెంబరులో మున్సిపాలిటీలో అక్రమాల వ్యవహారం అప్పటి కలెక్టర్ దృష్టికెళ్లగా.. సమగ్రంగా విచారణ చేయాలని మున్సిపల్ ఆర్డీకి ఆయన ఆదేశించారు. అయినప్పటికీ ఇంతవరకు విచారణ చేపట్టినట్లు దాఖలాలు లేవు.

చైర్‌పర్సన్ ఫిర్యాదుతో వెలుగులోకి..

అకౌంట్స్ విభాగంలో అవినీతి భారీఎత్తున జరిగిందని కోట్ల రూపాయలు పక్కదారి పట్టించారనీ, దీనిపై లోతుగా విచారణ చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ ఈనెల 9న ఏసీబీ అధికారులకు లేఖ రాశారు. గతంలో పనిచేసిన కమిషనర్ ప్రమోద్‌కుమార్‌తోపాటు ప్రస్తుతం అకౌంట్స్ సెక్షన్‌లో విధులు నిర్వహిస్తున్న మనోహర్ కలిసి భారీఎత్తున అవినీతికి పాల్పడ్డారని లేఖలో పేర్కొన్నారు. ఏసీబీతోపాటు మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్‌కు కూడా కొన్ని ఆధారాలు జతచేసి లేఖ పంపారు. చైర్‌పర్సన్ పంపిన లేఖ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. పనులు చేయకపోయినా కొంతమంది కాంట్రాక్టర్లకు చెక్కులు ఇచ్చి, 20 నుంచి 30 శాతం కమీషన్ దండుకున్నట్లు చైర్‌పర్సన్ ఏసీబీకి పంపినలేఖలో పేర్కొన్నారు. ఈ అవినీతిపై లోతుగా విచారించి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు. ఈ పరిణామం మున్సిపాలిటీ, కాంట్రాక్టర్లలో కలకలం రేపింది. దీనిపై ఉన్నతాధికారులు లోతుగా విచారణ చేపడితే ఎంతమేర అవినీతి జరిగిందో వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

భార్య, అత్తామామల దారుణహత్య



మృతి చెందిన భార్య, అత్తమామలతో పాటు నిందితుడు నవీన్ (ఫైల్)

బెంగళూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లాడిన భార్యతో గత కొంతకాలంగా తలెత్తిన వివాదాలతో విసుగు చెందిన భర్త ఏకంగా భార్యతో పాటు అత్తమామలను దారుణంగా హత్య చేసిన సంఘటన చోటుచేసుకుంది. జిల్లా కేంద్రం యాదగిరి తాలూకా సైదాపుర వద్ద హత్యలు జరిగాయి. నవీన్ అనే వ్యక్తి భార్య అన్నపూర్ణ (25), అత్త కవిత(45), మామ బసవరాజప్ప(52)ను హత్య చేశాడు. వీరంతా దావణగెరకు చెందినవారు. యాదగిరి తాలూకా మునగల్ గ్రామానికి చెందిన నవీన్ నాలుగేళ్ల కిందట అన్నపూర్ణను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. కొంతకాలంగా అన్యోన్యంగా సంసారం సాగించారు. వీరికి ఒక కుమార్తె కూడా ఉన్నారు. ఇటీవల కొంతకాలంగా భార్యాభర్తల మధ్యన గొడవలు జరుగుతున్నాయి. భర్త వేధింపులు తట్టుకోలేని అన్నపూర్ణ పుట్టినింటికి చేరారు. ఎంతకాలమైనా భార్య వెనుతిరిగి రాకపోవడంతో జీర్ణించుకోలేని నవీన్ బుధవారం దావణగెరెలోని మామ ఇంటికి చేరుకుని భార్యను కాపురానికి పంపాలని కోరారు. రాజీ చేశాక కొన్ని నిబంధనలు విధించి భార్యను పంపేందుకు అంగీకరించారు. అన్నపూర్ణతో పాటు తల్లిదండ్రులు యాదగిరిలో భర్త నవీన్ ఇంటికి వెళ్లారు. అక్కడ మరోసారి నవీన్ బంధువుల సమక్షంలో రాజీ జరిగింది. ఇక బయలుదేరుతామని అత్తమామలు తెలిపారు. ఇంటి నుంచి బస్టాండ్ దాకా నడిచి వెళ్లలేరు కారులో వదిలి వస్తానంటూ నమ్మించాడు. దీంతో అత్తమామలతో పాటు భార్యను కారులో బయలుదేరిన నవీన్ నిర్జన ప్రదేశానికి వచ్చాక అప్పటికే సిద్ధంగా ఉంచుకున్న ఐరన్ రాడ్‌తో తలలపై కొట్టి చాకుతో పొడిచి ముగ్గురిని దారుణంగా హత్య చేశాడు. అనంతరం ముగ్గురి మృతదేహాలను కారులోనే వడగేర తాలూకా జోళదడగి గ్రామ శివారులో పడవేశాడు. అన్నపూర్ణ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. తర్వాత కొంత దూరంలో మరో రెండు మృతదేహాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. యాదగిరి పోలీసులు కేసు నమోదు చేసుకుని నవీన్ కోసం గాలింపులు జరుపుతున్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి జాతర



పాలకడవలతో వస్తున్న పూజారుల వెంట భక్తులు

పావగడ, జూలై 18 : తాలూకాలోని దాదాపు 15గ్రామాల ఇలవేల్పుగా కొలిచే లక్ష్మీ నరసింహ స్వామి జాతర మహోత్సవాన్ని ఆషాఢ ద్వాదశి రోజైన గురువారం మీనకుంటపల్లిలో వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఎద్దులబండ్లను, గొర్రెలు, మేకలను ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. రాంపేట గ్రామం నుంచి పాలకడవలతో పూజారులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండగా... మహిళలు జ్యోతులు మోస్తూ వారిని అనుసరించారు. ప్రదక్షిణల అనంతరం పాలకడవలతో స్వామివారి విగ్రహాలకు అభిషేకం చేశారు. అనంతరం నైవేద్యం సమర్పించా భక్తులకు తీర్థ ప్రసాదం అందజేశారు. దాదాపు 15గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

డప్పు కళాకారుడిపై దాడి

పావగడ, జూలై 18: తాలూకాలోని తిరుమణి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న అప్పాజిహళ్లిలో బుధవారం రాత్రి తనపై అదే గ్రామానికి చెందిన కొందరు కులం పేరు తో దూషిస్తూ దాడిచేసి గాయ పరిచారని గ్రామానికి చెందిన నాగరాజు అనే వ్యక్తి తెలిపాడు. బాధితుడు నాగరాజు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తొలి ఏకాదశి సందర్భంగా బుధవారం అదే గ్రామంలో డప్పు వాయించడానికి ఓ ఇంటివద్దకు తనతోపాటు మరికొందరు వెళ్తుండగా.... తమ కులదైవం వీరజిన్నయ్యకు డప్పు వాయించాలని ఓ సామాజిక వర్గానికి చెందిన కొందరు తమను అడ్డుకున్నారన్నారు. అయితే వారితో డబ్బులీసుకున్నందున వారి కార్యక్రమం అనంతరం మీకు వస్తామనడంతో వారు వినకుండా.... తమ చేతిలో ఉన్న డప్పులను పగలకొట్టి తమపై కట్టెలు, రాళ్లతో దాడిచేసి గాయపరిచారన్నారు. అంతేకాకుండా తన భార్య హేమలతను భయపెట్టారన్నాడు. తమపై నీ భర్త పోలీసులకు ఫిర్యాదు చేస్తే మిమ్మల్ని శాశ్వతం గా ఊరి నుంచి బహిష్కరిస్తామని, మీ కుటుంబాలను సమాధి చేస్తామని బెదిరించారని నాగరాజు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ మేరకు తనకు రక్షణ కల్పించాలని కోరుతూ... తనపై దాడికి పాల్పడిన వెంకటరమణ, పరమేశ్, పవన్, చంద్ర, మహేంద్ర, రవి అనే వ్యక్తులపై తిరుమణి పోలీస్‌స్టేషన్ లో గురువారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు పేర్కొన్నాడు.

దీక్ష మహోత్సవానికి తరలి రండి

పావగడ, జూలై 18 : చిత్రదుర్గంలో జరిగే ఈనెల 20న సిద్దరామేశ్వర మహాసంస్థానం భూవి గురుపీఠం అధ్యక్షుడు ఇమ్మడి సిద్దరామేశ్వరస్వామి దీక్షారంజిత మహోత్సవానికి పావగడ నుంచి అధిక సంఖ్యలో తరలి రావాలని భూవిసంఘం తాలూకా అధ్యక్షుడు బంగారప్ప తెలిపారు. గురు వారం సాయంత్రం స్థానిక ఐబీలో నిర్వహిం చిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.శనివారం ఉదయం 10గంటలకు పావగడ నుంచి ప్రతి గ్రామం నుంచి బస్సు సౌకర్యం కల్పించడంతో భూవి కులబంధవులు అధిక సంఖ్యలో తరలి వెళ్లాలని కోరారు.

అటవీశాఖ పునర్విభజన

- మారనున్న జిల్లా అటవీ ముఖచిత్రం
- కొత్తగా ఒక రేంజ్, 5 సెక్షన్లు, 14 బీట్స్
- కసరత్తు ప్రారంభించిన యంత్రాంగం



జిల్లా అటవీ శాఖాధికారి కార్యాలయం

అనంతపురం న్యూటౌన్, జూలై 18: జిల్లా అటవీశాఖ ముఖచిత్రం మారనుంది. ప్రస్తుతం ఉన్న మూడు రెంజ్‌లకు తోడు కొత్తగా తాడిపత్రి రేంజ్ ఏర్పాటు కానుంది. ప్రస్తుతం ఉన్న తొమ్మిది సెక్షన్స్‌కు అదనంగా మరో అయిదు సెక్షన్స్ ఏర్పాటు కానున్నాయి. జిల్లాలో ప్రస్తుతం ఉన్న 27 బీట్స్‌కు తోడు మరో 14 బీట్స్ ఎర్పడనున్నాయి. దీంతో మొత్తం బీట్స్ సంఖ్య 41కి చేరనుంది. ఈ విభజనకు అనుగుణంగా యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది.

అడవులను కోల్పోయిన అనంత

ఉమ్మడి జిల్లాలో అనంతపురం, కళ్యాణదుర్గం, గుత్తి, పెనుకొండ, బుక్కపట్నం, కదిరి.. మొత్తం ఆరు రేంజ్‌లు ఉండేవి. జిల్లా విభజనతో శ్రీసత్యసాయి జిల్లా పరిధిలోకి బుక్కపట్నం, పెనుకొండ, కదిరి రేంజ్‌లు వెళ్లాయి. ఎక్కువ అటవీ విస్తీర్ణం ఉన్న రేంజ్‌లు ఇవి. అనంతపురం జిల్లాలోని అనంతపురం, గుత్తి రేంజ్ పరిధిలో ఎక్కడా పెద్ద అడవులు లేవు. కళ్యాణదుర్గం రేంజ్‌లో మాత్రమే ఒక రకమైన అడవులు ఉన్నాయి. జిల్లా విభజన అనంతరం మరోసారి అటవీశాఖ బైఫర్‌గేషన్ దిశగా చర్యలు తీసుకుంటోంది.

కొత్తగా తాడిపత్రి రేంజ్..

యాడికి బీట్‌ను రెండుగా విడగొడుతున్నారు. ఈ రెండింటిని తాడిపత్రి సెక్షన్‌గా చేశారు. ముచ్చుకోట, పుట్లూరు సెక్షన్స్‌తో కలిపి తాడిపత్రి రేంజ్ ఏర్పడనుంది. ఇందుకు అనుగుణంగా సిబ్బంది సంఖ్య పెరగనుంది. అనంతపురం రేంజ్ పరిధిలో అనంతపురం, ఆత్మకూరు, గార్లదిన్నె సెక్షన్‌లు ఉంటాయి.

కొత్త సెక్షన్స్ ఇలా..

అటవీశాఖ బైఫర్‌గేషన్‌లో భాగంగా కొత్తగా 5 సెక్షన్స్ ఎర్పాటు కానున్నాయి. గార్లదిన్నె, ఉరవకొండ, శెట్టూరు, డి.హీరేహాళ్, తాడిపత్రి సెక్షన్స్ కొత్తగా ఏర్పడుతున్నాయి.

కొత్త బీట్స్ ఇవే..

కనంపల్లి, కలగల్లు, పంపనూరు, డి.హీరేహాళ్, ఆత్మకూరు, వెంకటాంపల్లి, కండ్లగూడూరు, అనుంపల్లి, గొల్లలదొడ్డి, దోసలేడు, ముద్దినాయనపల్లి, హొన్నూరు, గుమ్మఘట్ట.

విభజన ఇలా..

శింగనమల బీట్‌ను రెండుగా విభజిస్తారు. శింగనమల, కనంపల్లి బీట్స్‌గా విడగొడుతున్నారు. మరుట్ల నార్త్, సౌత్ బీట్స్‌కు అదనంగా కలగల్లు బీట్ ఏర్పాటు చేస్తారు. ఆత్మకూరు, వడ్డుపల్లి బీట్స్‌కు తోడు పంపనూరు బీట్ ఏర్పాటు చేయనున్నారు. గుత్తి రేంజ్‌లోని రాయలచెరువు బీట్‌ను రెండుగా విడగొడుతున్నారు. కొత్తగా కండ్లగూడూరు బీట్ ఎర్పాటు కానుంది. యాడికిని రెండు బీట్స్‌గా విడగొడుతూ.. కొత్తగా కోన ఉప్పలపాడు బీట్ ఎర్పాటు చేస్తున్నారు.